ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం 15 సెప్టెంబరు 2025



'సమ్మక్కసాగర్'లోకి 6.15 లక్షల క్యూసెక్కులు

కన్నాయిగూడెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వరద ప్రవాహం కొన సాగు తోంది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదు లుతుండటంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రా వతి నదుల నుంచి వరద నీరు వచ్చి గోదావరిలో చేరింది. దీంతో గోదావరికి వరద ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి 6,15,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుం డడంతో మొత్తం 59 గేట్లు ఎత్తి దిగువకు వదులు తున్నారు. దేవాదుల ఇన్‌టే క్‌వెల్ వద్ద గోదావరి నీటిమట్టం 82.95 మీటర్లు, తుపాకులగూడెం బ్యారేజీ వద్ద 81.10 మీటర్లు నమోదైంది.



మేడారం వనదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

వనదేవతలకు ప్రత్యేక పూజలు

మేడారంలో తల్లులను భారీ సంఖ్యలో దర్శించుకున్న భక్తులు


తాడ్వాయి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడా రం వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో దర్శించు కున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుం డా సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి గద్దెలకు చెరుకున్నారు.

ఎత్తు బంగారం(బెల్లం), పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారెలు, కొబ్బరికా యలు సమర్పించుకున్నారు. అనంతరం మే డారం పరిసరాల్లో చెట్ల కింద, వసతి గృహా ల్లో విడిది చేశారు. సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారనిదే వాదాయ శాఖ అధికారులు తెలిపారు. వనదే వతలను వరంగల్ డీఎంహెచ్‌వో అప్పయ్య దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

6.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జి ల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి వచ్చే ఇన్‌ఫ్లో 6.07 లక్షల క్యూసెక్కులుగా నమోదు కాగా గేట్లన్నీ ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 7.9 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారు లు తెలిపారు.



'ఫీ'పైర్!

ఫీజు బకాయిలు చెల్లించాలని కళాశాలల సమ్మెబాట

- నేటి నుంచి 21వ తేదీ వరకు తొలి దఫా మూసివేత
- ఈలోగా చెల్లించకుంటే కళాశాలల నిరవధిక సమ్మె
- నాలుగేళ్లుగా పేరుకుపోయిన రీయింబర్స్‌మెంట్ బిల్లులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.570కోట్ల బకాయిలు
- టోకెన్లు ఇచ్చినా విడుదల కాని నిధులు
- పలుకుబడి ఉన్న కాలేజీ యాజమాన్యాలకే చెల్లింపులు
- మనుగడ కష్టంగా మారిన చిన్న కాలేజీలు

హనుమకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు ఆందోళనబాట పట్టడంతో విద్యార్థుల భవిష్య త్తుపై అయోమయం నెలకొన్నది. ఈనెల 15 సోమవారం నుంచి 21వ తేదీ వరకు మొదటిదఫాగా విద్యాసంస్థల బంద్ పాటించాలని ప్రైవేటు ఉన్నత విద్యాసం స్థల సమాఖ్య ఆదివారం హైదరాబాద్‌లో జరి గిన సమావేశంలో నిర్ణయించారు. ఈలోగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలిన ప్రభు త్వానికి అల్టిమేటం ఇచ్చారు. ఒక వేళ చెల్లించకుంటే 21వ తేదీ నుంచి నిరవధికంగా కళాశాలలను బంద్ పెట్టాలని నిర్ణయం తీసుకున్నది. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్య క్షుడు ఎస్.సుందర్‌రాజుతోపాటు పలు ఉన్నత విద్యా సంస్థల యాజ మాన్యాలు పాల్గొన్నాయి.

రూ.570కోట్ల బకాయిలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ ప్రైవేటు కాలేజీల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. ప్రైవేటు యాజమాన్యాల కింద నడుస్తున్న ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, బీఈడీ, ఎంఈడీ, డిగ్రీ, జూనియర్ కాలేజీలకు స్కాలర్‌షిప్పులతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సంక్షేమ శాఖలు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ఎప్పటికప్పుడు తయారు చేసి ట్రెజరీలకు సమర్పిస్తున్నాయి. ట్రెజరీల్లో చెల్లింపుల కోసం ఆర్థిక శాఖ సైతం టోకెన్లు జారీ చేసినా ప్రయోజనం లేకుం డా పోతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు రూ.570కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తంలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.170కోట్లు, 2023-24కు సంబంధించి రూ.170కోట్లు, 2024-25 సంవత్సరం బకాయిలు రూ.170కోట్లు, 2025-26 విద్యా సంవత్సరం మార్చితో ముగియనున్నది. ఈ బకా యిలు కూడా కలుపుకుంటే మొత్తం బకాయిలు రూ.680 కోట్లకు చేరుకుంటుంది. ట్రెజరీలో బిల్లులు చెల్లించిన తర్వాత బకాయిలు చెల్లించడానికి టోకెనుగా ఇచ్చిన మొత్తం రూ.50 కోట్ల వరకు ఉన్నాయి. ఎక్కువ మొత్తం బకాయిలు హనుమ కొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని కాలేజీలకు రావలసివే. సుమారు లక్షమంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్నారు. వీరిలో 50శాతం మంది బీసీ విద్యార్థులే కావడం గమనార్హం. ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతానికి చెందినవారు. ఎప్పుడో 2019 సంవత్స రానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు.. అది కూడా కొద్ది మొత్తం ఇటీవలే విడుదలయ్యాయంటే పరి స్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఫీజు కడుతుందికదా అన్న ధీమాతో ప్రైవేటు కళాశాలల్లో చేరిన పేద విద్యార్థుల కష్టాలు ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయవచ్చు. కష్టపడి చదువు పూర్తిచే సినా ఫీజు కట్టనందుకు కళాశాలల నుంచి ఫైనల్ సర్టిఫి కెట్లు పొందలేని దౌర్భాగ్య స్థితివారిది.

మూడేళ్ల నుంచి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజుల చెల్లింపు ఇప్పటి వరకు జరగలేదు. మార్చివస్తే 2025-26 విద్యా సంవత్సరం బకాయిలు కూడా తోడవుతాయి. ఒక్కో కాలేజీకి విద్యార్థుల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రూ.10కోట్ల నుంచి రూ.25కోట్ల వరకు బకాయిలు రావలసి ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 397 ఉన్నత విద్యా కళాశాలలు ఉన్నాయి. 8 ఇంజనీరింగ్ కాలేజీలు, 24 ఫార్మసీ కాలేజీలు, 8 నర్సింగ్ కాలేజీలు, 20 బీఈడీ కాలేజీలు, మూడు అగ్రిక ల్చరల్ కాలేజీలు, 2 హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలు, 332, ఇంటర్, డిగ్రీ కాలేజీలు నడుస్తున్నాయి. ఒక్క హనుమ కొండ జిల్లాలోనే 282 కాలేజీలు (మిగతా 8లో..)



ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే చెల్లించాలి

సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్,
డిగ్రీ, పీజీ కళాశాల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఉన్నత విద్యా సంస్థలకు మూడేళ్లుగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. ఈనెల 15 నుంచి 21వరకు ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటిస్తాయి. అప్పటికీ ప్రభుత్వం స్పందించపోతే నిరవధిక బంద్ పాటిస్తాయి. రాష్ట్రంలో 25లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి తమ ఉన్నత చదువులను కొనసాగిస్తున్నారు. ఫీజు రీయింబర్స్ చేయకపోవడంవల్ల ఎక్కువగా నష్టపోయేది బహుజన విద్యార్థులే. వారి భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి.

22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కాళేశ్వరంలో పోటెత్తనున్న భక్తజనం



సరస్వతి అమ్మవారు

మహదేవపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని కాళేశ్వర త్రి వేణి సంగమం ఒడ్డు నున్న కాళేశ్వర ము క్తీశ్వర ఆలయంలో ఈనెల 22 నుంచి దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. అక్టో బరు 2 వరకు కొన సాగనున్నాయి.ఈ సందర్భంగా 11 రోజు లపాటు వివిధ అలంకరణల్లో భక్తులకు అమ్మవారు దర్శమివ్వను న్నారు. ఈ ఉత్సవాల కోసం ఆలయాన్ని అధికారులు ముస్తాబు చేస్తున్నారు.

రోజువారీగా పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళేశ్వరం ఆలయంలో రోజూ ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, రుత్విగ్వరణం, దీక్షా వస్త్రాదారణ, రక్షా బంధనం, మండపారాధన, హారతి, మంత్ర పుష్పం, అగ్ని ప్రతిష్ఠాపన, నవగ్రహ, రుద్ర, నమక, చమక, పంచసూక్తి, మూల మంత్ర చండీ హోమం తదితర పూజలు జరుగనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారంతో అలంకరించనున్నారు. 11 రోజుల పాటు పూలు, పండ్లు, బంగారం నగలు, పట్టు చీరెలతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

11 రోజుల పాటు అవతారాలు

అమ్మవారు 11 రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. బాలా త్రిపుర సుందరీ దేవి, గాయత్రి దేవి, అన్న పూర్ణదేవి, కాత్యాయనీ దేవి, మహాలక్ష్మి దేవి, లలితా దేవి, మహాచండి దేవి, సరస్వతి దేవి, దుర్గాదేవి, మహిషసుర మర్దినిగా అమ్మవారు భక్తులకు దర్శనం చేయనున్నట్లు అర్చకులు తెలిపారు. చివరి రోజు దసరా రోజు సాయంత్రం గోదావరికి మంగళవాయిద్యాలతో బయల్దేరి శమి పూజ చేసి అనంతరం అమ్మవారి ఉత్సవాలను ముగించనున్నట్లు అర్చకులు తెలిపారు.



బొగతలో పర్యాటకుల సందడి

బొగతలో పర్యాటకుల సందడి

వాజేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి: తెలంగాణ నయాగరా బొగత జలపా తం వద్ద ఆదివారం సందడి కనిపించింది. వారాంతపు సెలవు కావడంతో పర్యాట కులు పోటెత్తారు. జలపాతం అందాలను వీక్షించేందుకు భారీగా తరలి వచ్చారు. ప్రకృతి సౌందర్యాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉరకలేస్తోంది. కొండల నడుమ జాలువారుతూ విశేషంగా ఆకట్టుకుంటోంది. జలపాతం ఈత కొలనులో పర్యాటకులు జలకాలాడుతూ పరవశించిపోతు న్నారు. జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ ముచ్చటపడ్డారు.

పర్యాటకుల మధ్య వాగ్వాదం

బొగత జలపాతం వద్ద ఆదివారం మధ్యాహ్నం పర్యాటకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సందర్శనకు వచ్చిన ఓ మహిళపై ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిం చడంతో కొద్దిసేపు ఘర్షణ చోటుచేసుకుంది. సుమారు గంటన్నపాటు గొడవ జరి గింది. ఓ దశలో ఓ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట సైతం చోటు చేసుకుంది.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- మహాజాతరలో ట్రాఫిక్ సమస్య ఏర్పడొద్దు
- సులభంగా చేరుకొనేలా ఎడ్లబండ్ల దారులను అభివృద్ధి చేయాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి ధనసరి సీతక్క



గోనెపల్లి వద్ద ఎడ్ల బండ్ల బాటను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, ఎస్పీ శబరీశ్



ఎస్పీతో కలిసి బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రా నున్న మహాజాతరలో భక్తులు ఏమాత్రం ఇబ్బంది పడకుండా ప్రయాణాన్ని సులభతరం చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధన సరి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడా రంలో ఆమె ఆదివారం పర్యటించారు. మేడారా నికి వచ్చే ఎడ్లబండ్ల దారులను ఎస్పీ శబరీశ్‌తో కలిసి పరిశీలించారు. మేడారానికి భక్తులు ట్రాఫిక్ ఇబ్బందులు పడకండా పస్రా నుంచి మేడారం వరకు అడవి మీదుగా చేరుకోడానికి ఎడ్లబండ్ల దారులను గుర్తించి అభివృద్ధి చేయా లని అధికారులను ఆదేశించారు.

పస్రా నుంచి పాత నాగారం, ముత్తాపూర్, మొట్లగూడెం, గోనె పల్లి మీదుగా మేడారం వరకు భక్తుల వాహనా లు, ఎడ్లబండ్లు వచ్చే విధంగా నూతన రహదా రులను ఏర్పాటుకు ప్రణాళికలు రూపొం దించా లని అన్నారు. ఈ గ్రామాల మీదుగా పర్యటిస్తూ ఎడ్లబండ్ల దారుల పరిస్థితిని తెలుసుకున్నారు. పస్రా నుంచి మేడారం వరకు మరో నూతన మార్గం ఏర్పాటు చేయడంతో తాడ్వాయికి చేరు వలో ఉన్న కొండపర్తి గ్రామం మీదుగా 163 జా తీయ రహదారికి నూతన మార్గం ఏర్పడే అవ కాశాలు ఉన్నాయని గుర్తించారు. వెంటనే ప్రణా ళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని మంత్రి అన్నారు. మున్ముందు మేడారం జాతర అభివృద్ధి జరగనుందని, కోట్లాది సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం వస్తున్న భక్తులకు మెరుగైన మార్గం సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు కొనసా గుతున్నాయని అన్నారు.

బుల్లెట్ బండి ఎక్కి...

మేడారంలో పర్యటించిన మంత్రి సీతక్క ఎడ్లబండ్ల రహదారులను ఎస్పీ శబరీశ్‌తో కలిసి పరిశీలించారు. మంత్రి కాన్వాయ్ వెళ్లలేని పరిస్థి తి ఉండగా ద్విచక్రవాహనంపై ఆమె ప్రయా ణించారు. ఎస్పీ బుల్లెట్ నడపగా వెనుక మం త్రి కూర్చొని ఎడ్లబండ్ల రహదారుల మీదుగా వెళ్లారు. కాల్వపల్లి నుంచి కన్నెపల్లి, మేడారం నుంచి కొండపర్తి రహదారులను, జంపన్న వా గులో వరదకు కొట్టుకుపోయిన లోలెవల్ కాజ్ వేలను పరిశీలించారు. మరమ్మతులకు అధికారు లు ప్రణాళికలు రూపొందించినట్టు తెలి పారు. మేడారం అభివృద్ధికి (మిగతా 8వ పేజీలో)

- జీజీహెచ్‌లో గాడి తప్పిన నిర్వహణ
- పర్యవేక్షణ లేక సరిగా అందని వైద్య సేవలు
- నెల రోజులుగా థైరాయిడ్ పరీక్షలు బంద్
- వేధిస్తున్న పారిశుధ్య లోపం, తాగునీటి సమస్య

వీడని నిర్లక్ష్యం!



జీజీహెచ్‌లో మధ్యాహ్నం సమయంలో తాళం వేసి ఉన్న ఎక్స్‌రే గది

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) నిర్వహణ గాడి తప్పిందని తెలుస్తోంది. అనేక సమస్యలు ఇక్కడ తిష్టవేశాయనే విమర్శలు వస్తున్నా యి. రోగులకు సరైన వైద్యం సకాలంలో అందడం లేదనే ఆవేదన వ్యక్తమ వుతోంది. ఇక్కడ వైద్య పరీక్షలు లేక ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని అంటున్నారు. సుమారు నెల రోజులుగా థైరాయిడ్ పరీక్షలు చేయకపోవడం ఇందుకు నిదర్శనం. జీజీహెచ్ సిబ్బంది ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులతో కుమ్మక్కై రోగులను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇతర సేవల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని రోగులు అంటున్నారు. అలాగే ఈ ఆస్పత్రిలో అందించే ఆహారంలో నాణ్యతా ప్రమా ణాలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. డైట్ కాంట్రాక్టర్ ప్రభుత్వ సొమ్ముతో జేబులు నింపుకుంటున్నా ఉన్నాతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

సిబ్బంది చేతివాటం!

భూపాలపల్లి పీహెచ్‌సీ నుంచి జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ అయిన జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రోజుకు 400 నుంచి 500మంది వరకు రోగులు ఇక్కడికి వస్తుంటారు. జిల్లా నలు మూలల నుంచే కాకుండా పెద్దపల్లి, మంచిర్యాల నుంచి తరలివస్తుం టారు. మహారాష్ట్ర సిరోంచ నుంచి కూడా వచ్చి ఇక్కడి వైద్య సేవలను పొందుతారు. ఇంత మందికి పెద్ద దిక్కు అయిన జీజీహెచ్‌లో నిర్లక్ష్యపు నీడలు కమ్ముకుంటున్నాయి. ఇక్కడ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అలాగే విధుల్లో ఉన్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారనే విమర్శలు వస్తున్నా యి. సమయపాలన పాటించక పోవడం, ఓపీఅధికంగా ఉన్న సమ యాల్లో కుడా నిర్లక్ష్యంగా వ్యవహ రించడం లాంటి దుశ్చర్యలకు పా ల్పడుతున్నారని తెలుస్తోంది. ఇక్క డికి వచ్చే గర్భిణులు, రోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం పారిపటిగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రిలో కొద్ది రోజు ల వరకు రక్తపరీక్షలు నిలిచిపోవడం తో సిబ్బంది ఇదే అదునుగా భావించి రోగుల వద్ద నుంచి శాంపిల్స్ కలెక్ట్ చేసి ప్రైవేటు ల్యాబ్స్‌కు పంపి జేబులు నింపుకున్నట్లు తెలిసింది. ఎల్ఎఫ్టీ, ఆర్ఎఫ్టీ, థైరాయిడ్ వంటి పరీక్షలు ఆస్పత్రికి అనుసంధానం గా ఉన్న టీ-హబ్‌లో కూడా అందుబాటులో లేకపోవడంతో రోగుల నుంచి పెద్దమొత్తంలోనే వసూలు చేసి జేబులు నింపుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటి వరకు దాదాపు నెల రోజులకు పైగా ఆస్ప త్రిలో థైరాయిడ్ పరీక్షలు నిలిచిపోయినా పునరుద్ధరించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ల్యాబ్ వద్ద పనిచేయాల్సిన కొంత మంది సిబ్బంది సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద తిష్టవేసి వైద్యులను, తోటి సిబ్బందిని ఇబ్బందులకు (మిగతా 8వ పేజీలో)



ఆస్పత్రిలో పేరుకుపోయిన బయో వేస్టేజ్



రాజీపడేది లేదు..

జీజీహెచ్‌లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఏమాత్రం రాజీపడేది లేదు. రోగులకు పట్టించుకోని సిబ్బందిని ఇంటికి పంపుతాం. ఆస్పత్రిలో నెలకొన్న పారిశుధ్య సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తాం. డైట్ విషయంలో వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

\- గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే

రైతులకు తప్పని యూరియా తిప్పలు



అబ్బాపూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ములుగు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు తిప్పలు తప్పడం లేదు. సమయానికి యూరియా దొరక్క అవస్థలు పడుతున్నారు. గంటల కొద్దీ క్యూలో నిల్చొని నిరీక్షిస్తున్నారు. ములుగు మండలంలోని జగ్గన్నపేట, అబ్బాపూర్ గ్రామాల్లో యూరియా కోసం రైతులు ఆదివారం బారులుతీరారు. ఒక్కసారిగా రైతులు ఎగబడడంతో కొద్దిసేపు గందరగోళ వాతావరణం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్యూలైన్లలో నిలబెట్టారు. ఒక్కో రైతుకు బస్తా చొప్పున యూరియా లభ్యమైంది.

ములుగు జిల్లాలో సగటు వర్షపాతం 4.68 సెం.మీ

- వెంకటాపురం మండలంలో అత్యధికంగా 13.02 సెం.మీ

ములుగు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో జోరుగా వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 42.20 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 4.68 సెం.మీ రికార్డు అయ్యింది. అత్యధికంగా వెంకటాపురం మండలంలో 13.02 వర్షపాతం నమోదైంది. కన్నాయిగూడెం మండలంలో 6.38 సెం.మీ, ఏటూరునాగారం మండలంలో 6.16 సెం.మీ, వాజేడు 4.36, వెంకటాపూర్ 3.42 సెం.మీ, మంగపేట 2.42, తాడ్వాయి 2.36, గోవిందరావుపేట మండలంలో 2.36 సెం.మీ, ములుగు మండలంలో అత్యల్పంగా 1.72 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు



అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్దనున్న అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోటపలుకుల రమేష్, పైస్ల శాంతికుమార్, అన్నారపు రాజేందర్, జి.శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, నేరేళ్ల జోసెఫ్, తాళ్ల పోశం తదితరులు పాల్గొన్నారు.

టీపీడీఈఏ అధ్యక్ష, కార్యదర్శులుగా సుబ్రమణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్

రాంనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీజీ ఎన్పీడీసీఎల్ తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ కంపెనీ కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా నార్ల సుబ్రమణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హంటర్‌రోడ్డులోని దీపాభవన్‌లో జరిగిన ఎన్నికల్లో కంపెనీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా అనిల్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇంద్రాసేనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.శ్రీనివాస్, అడ్వయిజర్లుగా మధుసూదన్, మనోహర్, కార్యవర్గ సభ్యులుగా తరుణ్, వరుణ్, జ్యోతిర్మయి, రాములు, లక్ష్మణ్, వాలు ,సత్యనారాయణ, యుగేందర్, ఖలీం, టి.శ్రీనివాస్, కాంత్రికుమార్, కార్యాలయం కార్యదర్శిగా భవాని ఎన్నికయ్యారు.



మహర్దశ పట్టని ఊరట్టం రోడ్డు



నిలిచిపోయిన వనం రోడ్డు పనులు

పనుల్లో జాప్యం ఎందుకు?

- మేడారంలో అభివృద్ధి పనులకు గ్రహణం
- నిధులు ఉన్నా పురోగతి శూన్యం
- నెలలు గడుస్తున్నా ముందుకు సాగని నిర్మాణాలు

తాడ్వాయి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. నిధులు ఉన్నా పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. గత మహా జాతర(2024) సందర్భంగా మేడారంలో అభివృద్ధి పనులకు రూ.115 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ద్వారా పనులు చేపట్టగా రూ. 22.93 కోట్ల నిధులు(లెస్ ఎమౌంట్) మిగిలాయి. వీటిలో పంచాయతీరాజ్ నిధులు రూ. 19.85 కోట్లు ఉండగా, కలెక్టర్‌కు కేటాయించిన ప్రత్యేక నిధులు రూ.3.08 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తం నిధులను మేడారంలో పలు శాశ్వత పనులు చేపట్టేందుకు కేటాయించారు. ఈ క్రమంలో 2024 అక్టోబరు 21న మంత్రి సీతక్క చేతుల మీదుగా రూ.22.93 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. అయితే.. 11 నెలలు గడుస్తున్నా కొన్ని పనులు ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని మొదటి దశలో నిలిచిపోయాయి. నిధులు ఉన్నప్పటికీ ఎక్కడి పనులు అక్కడే ఉండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



క్యూలైన్లపై చేపట్టని షెడ్డుల నిర్మాణం

ఆరంభ శూరత్వమేనా..?

మేడారంలో పంచాయతీరాజ్ శాఖ రూ. 22.93 కోట్లతో మొదలెట్టిన పనుల్లో వనదేవతలను పూజారులు వనం తీసుకొచ్చే రోడ్డు నిర్మాణం ఉంది. 24 ఫీట్లతో 420 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించేందుకు రూ.1.30 కోట్లు కేటాయించారు. కాల్వపల్లి మీదుగా ఊరట్టం గ్రామానికి భక్తులు చేరుకునేలా రూ.8కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం, క్యూలైన్లపై షెడ్ నిర్మాణానికి రూ.3.08 కోట్లు కేటాయించగా వీటి మొదటి దశ పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా నార్లాపూర్ చెక్‌పోస్టు నుంచి కాల్వపల్లి గ్రామం వరకు రూ.2.50 కోట్లతో 4 కిలోమీటర్ల బీటీ రినివల్ పనులు, శివరాంసాగర్ మీదుగా వీఐపీ, వీవీఐపీ పార్కింగ్‌లకు వెళ్లే మార్గంలో రూ.2.75 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం, ఆదివాసీ మ్యూజియం వెనకాల నుంచి నారింజ బంధం వరకు రూ.1.30కోట్లతో బీటీ రోడ్డు పనులు చేపట్టనుండా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ క్రమంలో ఈ రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

పనుల జాప్యంపై అనుమానాలు

శంకుస్థాపన చేసి 11 నెలలు గడుస్తున్నా పలు పనులు ప్రారంభించపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు జాప్యం చేసి, మహాజాతర సమయంలో హడావిడిగా నాసిరకంగా పూర్తిచేసి చేతులు దులుపుకొనేందుకు కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్ అదాలత్‌లో 1,466 కేసుల పరిష్కారం

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ నెల 13న నిర్వహించినజాతీయ లోక్‌అదాలత్‌లో 1,466 కేసులు పరిష్కారం అయ్యాయని ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐపీసీ బీఎన్ఎస్ కేసులు-355, సైబర్ క్రైమ్- 15, డీడీ, ఎంవీ యాక్టు-1096కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. 15 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.88వేల నగదును బాధితుల ఖాతాల్లో జమ చేయడానికి సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు ఆర్డర్ కాపీలు ఇప్పించారని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వాజేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మురుమూరు పంచాయతీలోని కొప్పుసురులో రోడ్డ మహేష్‌కు చెందిన ఇంట్లో అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో మహేష్ దంపతులు, ఇద్దరు పిల్లలు బయటకు పరుగులు పెట్టారు. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా రేకులు తప్ప సర్వం దగ్ధమయ్యాయి. సంఘటన స్థలాన్ని రెవెన్యూ, విద్యుత్ అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం కలిగినట్టు బాధితుడు మహేష్ తెలిపాడు.



అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన వస్తువులు

మొక్కల పెంపకంతో మానవ మనుగడ

- సింగరేణి సీఎండీ బలరాంనాయక్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో మానవ మనుగడ సాధ్యమని, భవిష్యత్ తరాలకు మనమిచ్చే గొప్ప సంపద ఇదేనని సింగరేణి సీఎండీ ఎన్.బలరాంనాయక్ అన్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధి 5 ఇన్‌క్లైన్‌లోని సింగరేణి నర్సరీలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి 370 మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే 5 ఇన్‌క్లైన్ ప్యానెల్ సమీపంలో గతంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి పచ్చదనంతో వెల్లివిరియాలనే దృక్పథంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటి వరకు 20,377 మొక్కలను తానే స్వయంగా నాటినట్లు వివరించారు. ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా 40 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 25 లక్షల మొక్కలు నాటామని అన్నారు. త్వరలోనే మిగిలిన మొక్కలు సైతం నాటుతామన్నారు. సింగరేణి ప్రభావిత పరిసరాల్లోని చెరువుల పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ, ఎన్విరాన్‌మెంటల్ జీఎం సైదులు, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న సీఎండీ బలరాంనాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కోటంచ ఆలయ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

రేగొండ : కొటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. మండలంలోని కొటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి సందర్శించారు. బాలాలయంలో ఉన్న స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సీఎండీ ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తి కాగానే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, ప్రధానార్చకుడు బుచ్చమాచార్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, ఆలయ ఛైర్మన్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కార్మికుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని కేటీకే-6 ఇన్‌క్లైన్‌లో శనివారం జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుడు మొండయ్యను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడి వద్దకు ఆదివారం వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సింగరేణి జీఎం కోఆర్డినేటర్ టి. శ్రీనివాస్, డాక్టర్ బాల కోటయ్యను కోరారు. వెంకటరమణారెడ్డి వెంట టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకులు మిర్యాల రాజిరెడ్డి, నాగెల్లి సాంబయ్య ఉన్నారు.



కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం

పోటెత్తిన గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి పోటెత్తింది. ఆదివారం ఉదయం నుంచే ఉధృతంగా ప్రవహిస్తోంది. మెట్లు దాటి ఎత్తుతో ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. త్రివేణి సంగమం వద్ద ఆదివారం 10.60 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవాహం కొనసాగుతోందని తెలిపారు. జాలర్లు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆనందం

రాంనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడిగా వరంగల్ సర్కిల్‌లో టెక్నికల్ డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ఆనందం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని ఓ సమావేశ మందిరంలో రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్, రాష్ట్ర సెక్రెటరీ జనరల్ మేడి రమేశ్ ఆధ్వర్యంలో కంపెనీ ఎన్నికలు నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శంకర్, జనరల్ సెక్రెటరీగా ఎన్.కుమారస్వామిలను ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆనందం మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై విరామం లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం ఏ పిలుపునిచ్చినా ఉద్యోగులు కదలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నాంపెల్లి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.చంద్రయ్య, అసోసియేషన్ ఫౌండర్ కలకుంట్ల మాణిక్యం పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ!

- 'లో కాస్ట్-నో కాస్ట్' పేరుతో సైన్స్ ల్యాబ్
- సొంత ఖర్చుతో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుడు చక్రధర్
- స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లో ఏర్పాటు
- విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన
- ఆదర్శంగా నిలుస్తున్న ఫిజిక్స్ టీచర్



ల్యాబ్‌లో పరికరాలతో బోధన చేస్తున్న చక్రధర్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచడం, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఓ సైన్స్ ఉపాధ్యాయుడు చేసిన ప్రయత్నం శభాష్ అనిపిస్తోంది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎం.చక్రధర్ కొద్ది రోజుల క్రితం సొంత ఖర్చుతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సైన్స్ అంశాలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం పాఠ్యాంశాలు సులభంగా అర్థం కావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. లో కాస్ట్, నో కాస్ట్ పద్ధతిలో ప్రతీ నెలా తన వేతనం నుంచి కొంత భరిస్తూ కేవలం రూ.30వేలతో హెచ్‌ఎం ఎం.సంపత్ సహకారంతో ల్యాబ్ ఏర్పాటు చేయడం విశేషం.



మన సౌర కుటుంబం

సులభంగా అర్థమయ్యేలా..

పాఠశాలలోని ఒక గదిలో సైన్స్ పరికరాలు, వస్తువులను అమర్చారు. సుమారు 350 ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులకు సంబంధించిన సైన్స్ కృత్యాలు, ప్రయోగాలు ఏర్పాటు చేశారు. సైన్స్ పాఠాలు చదివి వివరించడమే కాకుండా, ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా, చిత్రాలు, పట్టికల రూపంలో విద్యార్థులకు చూపుతూ పాఠ్యాంశాలు సులభంగా అర్థం కావడానికి కృషి చేస్తున్నారు. ప్రధానంగా ల్యాబ్‌లో పలు భౌతిక శాస్త్ర పాఠ్యాంశాలకు చెందిన కృత్యాలు, పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిలో కాంతి ప్రయోగాలు, లేజర్ కాంతి, ధ్వని, అయస్కాంతాలు, మన విశ్వం ఉన్నాయి. ఇక రసాయన శాస్త్రానికి సంబంధించి 118 మూలకాలతో నూతన పీరియాడిక్ టేబుల్, ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్ డయాక్సైడ్ తయారు చేయడం, రసాయన చర్యలకు సంబంధించిన ప్రయోగాలు ఏర్పాటు చేశారు. లోహాలు, అలోహాలు, వాటి ధర్మాలు, ఆమ్లాలు, క్షారాలు, బేసిక్ ఎలక్ట్రానిక్స్ ప్రకృతి చక్రం, రవాణా, రోడ్డు భద్రతా నియమాలు, పీహెచ్ స్కేల్ తదితర అంశాలకు చెందిన 350కి పైగా భౌతిక, రసాయన శాస్త్ర కృత్యాలు ఉన్నాయి. డ్రాయింగ్, లేబులింగ్, జత పరచడం, ప్రయోగాలు, పోస్టర్ డిజైనింగ్, ప్రాజెక్టు వర్క్, రీడింగ్, రైటింగ్ అభ్యాసం చేయిస్తున్నామని సైన్స్ టీచర్ చక్రధర్ చెబుతున్నారు. జీవ శాస్త్రానికి సంబంధించి మానవ శరీర భాగాలు, ధాన్యాలు, గింజలు, సహజ, కృత్రిమ నారలు, విత్తనాలు, ఆహార రకాలు ఏర్పాటు చేశారు.

విస్తృతమైన ప్రయోగాలు

ల్యాబ్‌లో 350కి పైగా భౌతిక, రసాయన ప్రయోగాలు అందుబాటులో ఉన్నాయి. పాఠాల ప్రధాన భావనలను బలపరచడానికి యాంకర్ చార్ట్స్ గదిలో గోడలకు అతికించి ఉంటాయి. విద్యార్థులు తమ సృజనాత్మక ఆ లోచనలు భద్రపరచుకోవడానికి ఆవిష్కరణ విభాగం ఉంది. ఇంకా ఐడియా కార్డ్స్ సైన్స్ లాగ్ షీట్స్ లాప్ బుక్స్, 6 నుంచి 8 తరగతులకు వర్క్ షీట్స్ క్లాస్ రూం కాన్సెప్ట్ కార్డ్స్ విషయ పరిజ్ఞానం పెంపొందించడానికి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు.



స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లోని ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన మూలకాల పట్టిక

ఉద్యోగంలో చేరినప్పటి నుంచి..

ఖమ్మం జిల్లా మామిళ్ల గూడకు చెందిన మాడపాటి చక్రధర్ బీఎస్సీ, బీఏడ్ చదివి ఎస్‌జీటీగా 1997లో నియామకమై పీఎస్ పెద్దపెండ్యాల పాఠశాలలో చేరారు. అనంతరం ఎస్‌ఏ ఫిజిక్స్ టీచర్‌గా మొగుళ్లపల్లి హైస్కూల్‌లో పదోన్నతిపై చేరారు. తర్వాత ఖిలేషాపూర్, కుర్చపల్లి, మేకల గట్టు హైస్కూళ్లలో పని చేసి 2024 జూన్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లో విధులు నిర్వరిస్తున్నారు. 28ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన చక్రధర్ ఏ స్కూల్‌లో పని చేసినా విద్యార్థులు ప్రయోగాల ద్వారా నేర్చుకోవడానికి ఎక్కువగా కృషి చేస్తు అందరి మన్ననలు పొందుతున్నారు. మండల స్థాయిలో పలు అవార్డులు పొందిన ఆయన ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

విద్యార్థుల అవగాహన కోసమే..



పేద విద్యార్థులు సామాన్య శాస్త్రం అంశాలు, భావనలు సులభంగా అర్థం చేసుకోవాలన్న లక్ష్యంతో ల్యాబ్ ఏర్పాటు చేశాను. పుస్తకం ద్వారా బోధన కంటే కృత్యాధార బోధన ద్వారా పిల్లలు ఎక్కువగా అవగాహన చేసుకుంటారు. నెల నెలా వేతనం నుంచి కొంత వెచ్చిస్తూ ఈ కార్యక్రమం చేపట్టాను. పాఠ్య పుస్తకం, బ్లాక్ బోర్డు ఉపయోగించి సైన్స్ అంశాలు చెబితే విద్యార్థులు సులభంగా అ ర్థం చేసుకోలేరు. ల్యాబ్‌లో ఉన్న పలు కృత్య పరికరాలు ఉపయోగించి చెప్పడం వల్ల బాగా అర్థం చేసుకోగలుగుతున్నారు.

– ఎం.చక్రధర్, సైన్స్ టీచర్

ఇల్లందలో మరో అహోబిలం



ఇల్లందలో ఒకే ప్రాంగణంలో ఉన్న శివ-విష్ణు దేవాలయాలు

» ఒకే ప్రాంగణంలో శైవ-వైష్ణవ దేవాయాలు
» 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కట్టడాలు
» ఒకేచోట 4 శివలింగాలు, 2 నందులు
» శిథిలావస్థలో కట్టడాలు
» పట్టించుకోని ప్రభుత్వం

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం అహోబిలంలో నవ నరసింహ క్షేత్రాల మాదిరిగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో ఉంది. పూర్వకాలంలో వేద పండితులు ఇల్లంద ఆలయాన్ని ఆధారంగా చేసుకుని జఫర్‌గడ్, కక్కిరాలపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో తొమ్మిది లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను నిర్మించారు. ఇల్లందలో రాతితో ఏర్పాటు చేసిన ఈ ఆలయాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. 425 ఏళ్లకు పైగా చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది.



ఆలయంలోని రాతి స్తంభాలు

కాకతీయుల కాలం నాటి కట్టడాలు

మరో అహోబిలాన్ని తలపించేలా శివ-విష్ణు రూపస్ఫుట దేవాలయం (హరిహరులు ఒకే ప్రాంగణంలో ఉండడం) 18వ శతాబ్దంలో రామలింగేశ్వరస్వామి- లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయాలను ఒకేచోట వేర్వేరుగా నిర్మించారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయాలకు అంకురార్పణ జరిగినట్లు వేద పండితులు, పూర్వీకులు చెబుతున్నారు. దానికి గుర్తుగా ఆలయానికి నాలుగు వైపులా బురుజులు కనిపిస్తాయి. కుడి వైపున ఉన్న లక్ష్మీనర్సింహస్వామి, ఎడమ వైపున రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉండడం విశేషం. విష్ణుమూర్తి కుడివైపునా ఉండి, శివుడు ఎడమ వైపున కనిపించడం అరుదు. ఇలాంటి ఆలయం ప్రభుత్వ ఆదరణకు నోచుకోవడం లేదు.

ఆలయాల ప్రాముఖ్యత

దేవాలయాల నిర్మాణంలో ఎక్కడా సిమెంటు, మట్టి, ఇటుకలు లేకుండా రాతితో నిర్మించారు. వరంగల్ కోట తరహాలో దేవాలయంలోని గర్భాలయాలు, ముఖ మండపాలు, అర్ధ మండపాలు సుందరంగా తయారు చేసిన స్తంభాలు కనిపిస్తాయి. దేవాలయాలపై కప్పులు కూడా పూర్తిగా శిలలతో అపురూపంగా తయారు చేసిన రాతి నగిషీలు కనువిందు చేస్తాయి. కాకతీయుల కాలంలో ఆలయాలను నిర్మించినట్లు ఆలయం చుట్టూ నాలుగు బురుజుల ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. అవి శిథిలావస్థకు చేరి పిచ్చి మొక్కలు పెరిగాయి.

జీర్ణావస్థలో శైవ-వైష్ణవ ఆలయాలు

ఈ ఆలయాలను ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో చాలా సంవత్సరాలుగా ఆలయాలు జీర్ణావస్థకు చేరుకున్నాయి. ఉభయ దేవాలయాలపై నిర్మించిన గోపురాలు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. గర్భాలయాల పై ఇటుకతో నిర్మించిన గోపురాలపై చెట్లు మొలుస్తున్నాయి. వర్షాకాలంలో గోపురాలపై నుంచి గర్భాలయంలోకి నీరు కారుతూ పూజా కార్యక్రమాలకు ఇబ్బందిగా మారింది. భారీ వర్షాలు కురిస్తే ఎప్పుడు కూలుతాయోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ ప్రాంగణం కంటే గర్భాలయాలు, ముఖ మండపం రెండు అడుగుల లోతులోకి వెళ్లిపోయాయి. దీంతో వర్షపు నీరు దేవాలయంలోకి చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయానికి చుట్టూ ఉన్న ప్రాకారం కూడా రాతితో ఏర్పాటు చేశారు. సుమారు పది అడుగుల వెడల్పు, పది ఫీట్ల ఎత్తుతో నిర్మించిన ప్రహరీ రాళ్లు చెదిరి పడిపోతున్నాయి. చారిత్రక కట్టడాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ ఆలయంపై ఇప్పటికైనా శ్రద్ధ వహించి భక్తులు కోరుతున్నారు.

చతుర్లింగేశ్వర దేవాలయం

ఈ ఆలయం చతుర్లింగేశ్వర దేవాలయంగా ప్రసిద్ధి. గర్భాలయంలో కుష్మాండ లింగం, అర్ధ మండపంలో సోర లింగం, ముఖ మండపంలో బ్రహ్మసూత్ర లింగాలు కనిపిస్తాయి. అలాగే గర్భాలయానికి ఎదురుగా రెండు నందులు కూడా ఉండడం విశేషం.

ప్రతీ ఏటా ఉత్సవాలు

మాఘ మాసంలో పౌర్ణమి సందర్భంగా ఐదు రోజుల పాటు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తారు. అదే మాసంలో ఆరుద్ర నక్షత్రంలో శివ కల్యాణం మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణం సందర్భంగా ఇతర నగరాలు, ప్రాంతాలకు వెళ్లిన వేద పండితుల కుటుంబాలు సైతం తప్పనిసరిగా హాజరవడం సంప్రదాయంగా వస్తోంది. దీనికి తోడు హనుమాన్ జయంతి, వినాయక చవితి, దేవి నవరాత్రోత్సవాలు ఇందులోనే నిర్వహిస్తారు.



శిథిలావస్థలో ఉన్న ఆలయ గోపురం



విజేత ఆదిలాబాద్ బాలుర జట్టుకు షీల్డులను అందిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

బాల్ బ్యాడ్మింటన్ సందడి

» విజేతలుగా ఆదిలాబాద్ (బాలుర), మెదక్ (బాలికల) జట్లు
» బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తామన్న నిర్వాహకులు
» జనగామ జిల్లా కూనూరులో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

జఫర్‌గడ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (టీబీబీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాల వారీగా సబ్ జూనియర్ బాలుర, బాలికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదెపాక అయోధ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు బి.జయకర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వివి.రమణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలబాలికలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారన్నారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ప్రతీ ఏటా పోటీలను నిర్వహిస్తూ క్రీడా నైపుణ్యాలను వెలికితీస్తోందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల విజయవంతానికి సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, దాతలు, క్రీడాభిమానులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతులు

కూనూరులో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు 10 జట్ల చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో మొదటి స్థానం ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు సాధించగా నల్లగొండ (రెండు), కరీంనగర్ (మూడు), నిజామాబాద్ (నాలుగు) స్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం మెదక్ జట్టు, ఖమ్మం (రెండు), వరంగల్ (మూడు), ఆదిలాబాద్ (నాలుగు) స్థానాలు సాధించాయి. విజేతలకు ముఖ్య అతిథులు, అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన, క్రీడల నిర్వహణలో సహకరించిన ప్రతినిధులు, పీఈటీలను ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించి మెమెంటోలు అందించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర, వివిధ జిల్లాల ప్రతినిధులు నారాయణ రెడ్డి, వీరభద్రరావు, రవీంద్రకుమార్, వీరయ్య, కమల్‌కుమార్, తిరుపతి, శ్యాం, శ్రీనివాస్ రెడ్డి, బయ్యన్న, వి.రమణ, కృష్ణమూర్తి, సాంబయ్య, ఇల్లందుల కుమార్, సిహెచ్.శ్రీనివాస్, వాసుదేవరావు, కాటం లక్ష్మారెడ్డి, నీరటి ప్రభాకర్, కాటం రాజిరెడ్డి, పీడీ సాయికుమార్, అజయ్‌కుమార్, పెద్దిరెడ్డి, చందర్ పాల్గొన్నారు.

కూలిపోయిన పూనకాల 'శివాల మర్రి'



కూకటి వేళ్లతో కూలిపోయిన శివాల మర్రి

2017లోనే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

దీనిపై ఎండోమెంట్ శాఖ దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో భక్తులు ఇబ్బందులకు గురయ్యే అస్కారం ఉందని 'ఆంధ్రజ్యోతి' 2017లోనే హెచ్చరించింది. ప్రైవేటు స్థలం.. తామేమీ చేసేది అన్నట్లుగా శాఖ వదిలేసింది.

ఐనవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెయ్యేళ్ల విశ్వాసం.. శివసత్తులకు కొలువైన దైవం.. నిలువెల్ల భక్తిభావాన్ని నింపే ఐనవోలు మల్లన్న స్వామి శివాల మర్రి ఆదివారం సాయంత్రం కూకటి వేళ్లతో కూలిపోయింది. ఈ శివాల మర్రి మహావృక్షానికి ఎంతో మహిమ ఉందని ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం. యేటా బండారి తిలకంతో లక్షలాది మంది భక్తులకు పూనకాలిస్తుంది. వెళ్లి బోనం వండి నైవేద్యం సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లిస్తారు.

ఉత్తరం వైపు వృక్షం

మల్లికార్జునస్వామి ఆలయం ఉత్తరం వైపు వెయ్యేళ్ల పైనుంచే శివాల మర్రి కొలువైంది. అప్పటినుంచి మర్రిచెంతనే పూనకాలు మొదలవుతున్నాయని చరిత్ర. ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులు శివాలమర్రిని దర్శించుకున్నాకే ఆలయానికి స్వామివారిని దర్శించుకోవాలంటే ముందుగా ఈ మహా వృక్షం వద్దకు వెళ్లి పూజాతంతును పూర్తిచేశాకే ఆలయానికి పూనకాలతో వెళ్తారు. అలాంటి శివాల మర్రి కూలిపోవడం మల్లన్న భక్తులను ఆందోళన గురిచేస్తోంది.

ఇక్కడే పూనకాలు మొదలు

రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు డోళ్లు, ఢమరుకాలు, బండారిని తీసుకుని సమూహంగా మర్రి వద్దకు చేరుకుంటారు. పూసలు తొడిగిన అంగీలు, గజ్జెల లాగులు ధరించి చేతిలో వీరకోలు పట్టుకుంటారు. నుదుట బండారి పసుపు బొట్టు పెట్టాక.. వారిలో స్వామి వారు ఆవహిస్తారని విశ్వాసం. మూడుసార్లు మర్రి చుట్టూ తిరిగాక డోలు, ఢమురుక శబ్దాల నడుమ పూనకంతో శివమెత్తి తన్మయంతో శివనాట్యం చేస్తూ ఆలయ ప్రదక్షిణకు బయలుదేరుతారు. మూడుసార్లు తిరిగాక స్వామి వారిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి విడిది చేసిన చోటికి వెళ్తారు. వాహనాల సౌకర్యం లేనిరోజుల్లో భక్తులు ఎడ్లబండ్లపైనే ఐనవోలుకు వచ్చి శివాల మర్రి వద్దకు వెళ్లి ప్రదిక్షణలు చేసేవారు. ఊడలు దిగి విశాలంగా ఉన్న చెట్టు స్థలం 1954లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం, ఎండోమెంట్ శాఖ పట్టించుకోని కారణంగా చుట్టూ నిర్మాణాలు జరిగాయి. అప్పటి నుంచి భక్తులు కాలినడకన వెళ్లి దర్శించుకుంటున్నారు.



ఐనవోలు ఆలయ సమీపంలో శివాల మర్రి (ఫైల్)

రీ ప్లాంటేషన్ చేయాలి

ఎంతో చరిత్ర కలిగిన శివాల మర్రిని రీ ప్లాంటేషన్ ద్వారా మళ్లీ నిలబెట్టే అవకాశాలను పరిశీలించాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎండోమెంట్ శాఖ ఈ వృక్షాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ విషయంపై ఈవో సుధాకర్‌ను వివరణ కోరగా.. వృక్షాన్ని మళ్లీ నిలబెట్టే అవకాశంపై పరిశీలిస్తామని, ఆ స్థలం వారు సహకరిస్తే తప్పకుండా నిలబెట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ప్రాణాలర్పించినా పట్టించుకోరా ?

» రజాకార్లతో పోరాడిన తిమ్మంపేట
» తిరుగుబాటు గ్రామాన్ని గుర్తించాలని కోరుతున్న స్థానికులు
» గుర్తులుగా మిగిలిన బురుజు, చావడీ

దుగ్గొండి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామస్థుల తిరుగుబాటు కోసం ఏర్పాటు చేసుకున్న బురుజు, రజాకారుల నివాసం కోసం ఏర్పాటు చేసుకున్న చావడీలు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో చిహ్నాలుగా మిగిలాయి. రజాకారుల సైన్యం స్థానిక పోలీసు పటేల్, వారి అడుగుజాడల్లో ఉన్న భూస్వాములతో కలిసి గ్రామంలోకి చొరబడి గ్రామస్థులను చిత్రహింసలు పెట్టేవారు. అధిక పన్నులు వసూలు చేయడం, పన్ను చెల్లించనివారిని దండించడం, రోజురోజుకు వారి ఆగడాలు పెరగడంతో గ్రామస్థులు వారిపై తిరుగుబాటు చేశారు. సైన్యం చేతిలో కొంత మంది చనిపోయారు. ప్రధానంగా ఆత్మకూరు దేశాయి దొర ఆధ్వర్యంలో భూస్వాములు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. రక్షణ కోసం గ్రామస్థులు బురుజు నిర్మించి కాపలా కాసేవారు.

ప్రాణాలు కోల్పోయిన గ్రామస్థులు

1945లో రజాకారులను గ్రామానికి చెందిన కొంత మంది ప్రతిఘటించారు. వారిలో గొల్ల (తోటకూరి) బక్కయ్య, గొల్ల కనకయ్య, కత్తి సాంబయ్య, బాషబోయిన నర్సయ్యను రజాకారులు పట్టుకొని పాకాల అడవుల్లో కాల్చి చంపారు. వారి ప్రధాన అనుచరులుగా పని చేసిన భూపతి రాజలింగం, జనార్దన్, గడ్డం లక్ష్మీనర్సయ్య, కోమటి భద్రయ్యను చిత్రహింసలకు గురి చేశారు. గ్రామంలోని నాగెల్లి ముత్తయ్య, బండి మల్లయ్య, ఒద్దుల బుచ్చిరామయ్య, కుమ్మరికుంట్ల బొందయ్య, కూచన నర్సింహరాములు, గిన్నె మల్లయ్య రజాకారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారు. గ్రామంలో కుమ్మరికుంట్ల బొందయ్య నాయకత్వంలో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. బొందయ్య సీతారామయ్య అనే పేరుతో తుపాకి పట్టి రజాకారులు, భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా గుర్రంపై తిరుగుతూ వారిని ఎదిరించారు. భూస్వామ్యుల భూములను బొందయ్య పేదలకు పంచాడు. కానీ ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం అందకుండానే మృతి చెందాడు. వారి కుటుంబం సైతం ఎలాంటి లబ్ధి పొందలేదు.



తిమ్మంపేటలో ఉన్న బురుజు

గ్రామ రక్షణగా బురుజు

అప్పట్లో నిఘా కోసం 80 అడుగుల బురుజును గ్రామం మధ్యలో ఏర్పాటు చేసుకున్నారు. బురుజుపై గ్రామంలో వంతుల ప్రకారం కాపలాగా ఉండేవారు. ఆ బురుజు ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. ప్రస్తుతం 33 అడుగుల వరకు ఉండి చిహ్నంగా మిగిలిపోయింది. ప్రతి ఏడాది ఇక్కడ వద్ద దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు.

గ్రామంలో చావడీ


నిజాం రజాకారుల సైన్యం, పోలీస్ పటేల్, దొరలు, భూస్వాముల నివాసం కోసం గ్రామంలో చావడీని నిర్మించారు. ఇక్కడి నుంచే వారి కార్యకలాపాలు కొనసాగించేవారు. చావడీ నేటి వరకు గుర్తింపు చిహ్నంగా ఉండిపోయింది. ప్రస్తుతం చావడీలో ప్రతి ఏడాది ముస్లింలు పీరీలను ఏర్పాటు చేసి మొహర్రం ఉత్సవాలు జరుపుకుంటారు.



పోలీస్ పటేల్, దొరల నివాసం కోసం ఏర్పాటు చేసిన చావడీ

గ్రామానికి గుర్తింపు కల్పించాలి..

నాగెల్లి కొంరయ్య, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు



తిరుగుబాటు చేసిన గ్రామస్థులను రజాకారుల సైన్యం పాకాల అడవుల్లో కాల్చి చంపారు. గ్రామ రక్షణగా బురుజు నిర్మాణం చేసుకొని సైన్యం రాకను పసిగట్టి తిరుగుబాటు చేశారు. గ్రామంలో నెలకొల్పిన అమరవీరుల స్థూపం సైతం రోడ్డు వెడల్పులో లేకుండా పోయింది. ప్రతీ ఏడాది 17న విమోచన దినంగా అమరవీరులకు నివాళులర్పించాలి. ప్రభుత్వం గుర్తింపు కల్పించాలి.

అమరవీరుల స్థూపం నిర్మించాలి

తోటకూరి రాజు, తిమ్మంపేట



తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్థూపం గ్రామంలో నిర్మించాలి. బురుజు, చావడీలు మరమ్మతులు చేయాలి. దాని చుట్టూ కంచె నిర్మాణం చేసి నేటి తరానికి అందించాలి.

కేయూలో విద్యార్థుల ఆందోళన

ఎంబీఏ విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన ఆందోళన, ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం రాత్రి వర్సిటీ గెస్ట్ హౌస్ సమీపం లో దివ్యాంగుడైన ఎంబీఏ విద్యార్థిని ఓ విద్యార్థి సం ఘానికి చెందిన నాన్‌బోర్డరైన ఇద్దరు విద్యార్థి నాయకులు అడ్డుకుని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీంతో వర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. శనివారం జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకుని ఆదివారం మధ్యాహ్నం వర్సిటీ కామన్ మెస్ వద్ద మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మళ్లీ విద్యార్థుల మధ్య మాటా మాట పెరిగి గొడవకు దిగారు. ఎంబీఏ విద్యార్థిని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడమే కాకుండా ఆదివారం మళ్లీ బెదిరింపులకు దిగడంతో ఎంబీఏ విద్యార్థులు కేయూ క్యాంపస్‌లోని మొదటి గేటు వద్ద బైఠాయించారు. దాడులకు పాల్పడిన సదరు విద్యార్థి సంఘం నేతలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



కేయూలో నిరసన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో హనుమకొండ, సుబేదారి సీఐల నేతృత్వంలో ముగ్గురు ఎస్సైలు, పోలీసులు క్యాంపస్‌కు చేరుకున్నారు. అలాగే వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు ఆందోళనలకు దిగిన విద్యార్థులను సముదాయించేందుకు ప్రయత్నించారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఎంబీఏ విద్యార్థుల ఆందోళన వర్సిటీ క్యాంపస్‌లో కొనసాగింది. న్యాయం చేయాలని విద్యార్థుల నినాదాలతో క్యాంపస్ హోరెత్తింది. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని విద్యార్థులు నిరసన సాగించారు.

చేప పిల్లల పంపిణీ జరిగేనా ?

» సరఫరాకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
» గత బిల్లులు చెల్లించకపోవడమే కారణం



బాలసముద్రం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఉచిత చేపపిల్లల సరఫరా పథకం నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. చేప పిల్లలను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఆగస్టు చివరి వారంలో ప్రభుత్వం టెండర్ల దాఖలుకు చివరి రోజైన సెప్టెంబరు 1 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 24 జిల్లాలు మాత్రమే టెం డర్లు పడ్డాయి. ఇందులో 16 జిల్లాలకు మాత్రమే రెండు కంటే ఎక్కువ టెండర్లు దాఖలయ్యాయి. 8 జిల్లాలకు అసలే టెండర్లు పడలేదు. దీనితో ప్రభుత్వం టెండర్లు వేసేందుకు ఈనెల 8 వరకు గడువును పొడిగించింది. అయినా కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందనరాకపోవడంతో ఈ నెల 12 వరకు గడువును పొడిగించారు. టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి కారణం గత రెండు సంవత్సరాలుగా చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడమే కారణంగా తెలుస్తోంది. 2023-24 సంవత్సరంలో చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 74 కోట్లు చెల్లించకుండా బకాయి పెట్టింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం జూలై 12న టెండర్లను ఆహ్వానించింది.

బకాయి పడిన బిల్లులు చెల్లించకుండా టెండర్లు ఎలా వేస్తామని మత్స్య శాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశంలో కాంట్రాక్టర్లు ప్రశ్నించారు. పాత బిల్లులు త్వరలో ఇప్పిస్తామని టెండర్లలో పాల్గొనాల్సిందిగా అధికారులు కోరారు. రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా ఎవరు టెండర్‌లో పాల్గొనలేదు. టెండర్లు నిర్వహించకుంటే పేద మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకం రద్దవుతుందని అధికారులు కాంట్రాక్టర్లకు నచ్చజెప్పి ఆగస్టులో మూడోసారి టెండర్లు పిలిచారు. రాష్ట్రానికి చెందిన 30 మంది కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వం చేప పిల్లల కొనుగోలుకు రూ. 19. 26 కోట్లు మాత్రమే నిధులు కేటాయించిందని వాటితో రూ.80 కోట్ల చేప పిల్లలను సరఫరా చేసేందుకు ఎలా సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు ప్రశ్నించారు.

అధికారులు అందులో సగం 40 లక్షల చేప పిల్లల సరఫరాకు మాత్రమే టెండర్లు పిలవాలని జిల్లాల మత్స్యశాఖ అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. అంత వరకు మాత్రమే చేప పిల్లల సరఫరా జరిగింది. మళ్లీ 2025-26 సంవత్సరానికి రొయ్యలతో పాటు ఈ పథకం అమలుకు ప్రభుత్వం రూ. 122 కోట్ల 23 లక్షలు కేటాయించిందని, కానీ ఇంత వరకు బడ్జెట్ రిలీజ్ కాలేదని కాంట్రాక్టర్లు టెండర్ వేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఎలాగైనా టెండర్లు నిర్వహించి పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లు టెండర్లు వేయాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్

» ఖమ్మంలో జరిగిన 60 కేజీల విభాగంలో పతకం
» జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి హరిత
» ఆనందంలో స్వగ్రామం జనగామ జిల్లా ఇప్పగూడెం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఇప్పగూడెంకు చెందిన వారాల హరిత ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ 60కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన వారాల రాజు-రమ్య దంపతుల చిన్న కుమార్తె హరిత, నాల్గవ తరగతిలో హైదరాబాద్ హాకీం పేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపి కైంది. ప్రస్తుతం స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. వెయిట్ లిఫ్టింగ్‌లో తర్ఫీదు పొందిన హరిత జాతీయ స్థాయిలో రాణించడం విశేషం. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక కావడానికి క్రీడా కారులు రెండు స్టేట్‌మీట్‌లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధిం చాల్సి ఉంటుంది. అందులో భాగంగా హరిత సెప్టెంబర్ 7న హైదరాబాద్ లాలాపేట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్టేట్ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈరోజు (14 సెప్టెంబర్)న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన స్టేట్ మీట్‌లో హరిత గోల్డ్‌మెడల్ సాధించింది. ఈనెల 22న కర్ణాటక రాజధాని బెంగుళూరులో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొననుంది. హరిత ఎంపికపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోల్డ్ మెడల్‌తో వారాల హరిత

కలపను పట్టించుకొనే వారే కరువు

ఫారెస్టు టింబర్ డిపోలో చెదలు పడుతున్న దుంగలు



ఏటూరునాగారం అటవీశాఖ టింబర్ డిపోలో చెదలుపట్టిన కలప దుంగలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అధికారులు పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న విలువైన కలప మట్టిలో కలిసిపోతోంది. అక్రమంగా తరలించే కలపను స్వాధీనం చేసుకు న్నప్పటికీ దానికి సరైన రక్షణ కల్పించకపోవడంతో విలువైన దుంగలు చెదలు పుడుతున్నాయి. మండల కేంద్రంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయంలోని సెంట్రల్ టింబర్ డిపోలో ఈ పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయల విలువైన కలప ఎండకు ఎండి, వానకు తడిసిపోతోంది. అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం విస్మయానికి వ్యక్తమవుతోంది.

చెదలు పట్టిన దుంగలు

అక్రమ కలప రవాణాపై అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్వాధీనం చేసు కున్న తర్వాత దాని నిర్వహణకు పూర్తిగా గాలికొది లేస్తు న్నారు. అక్ర మంగా తరలిస్తున్నప్పుడు పట్టుబడిన కలపను అటవీశాఖ అధికారులు డిపోకు తరలించి, సైజుల వారీగా లాట్లుగా విభజిస్తారు. కానీ, వాటిని భద్రపరచడానికి సరైన షెడ్లు లేకపోవడంతో ఆ దుంగలను చెట్ల కిందనే నిల్వ చేస్తున్నారు. దీంతో అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో పెద్ద సంఖ్యలో కలప దుంగలు గుట్టలుగా పడి ఉన్నాయి. వీటిని మట్టి పాటు కాకుండా చూడడంలో అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. దీని వల్ల నెలల తరబడి ఎంతో విలువైన దుంగలు ఎండకు అవి బీటలు వారగా, వానకు తడిసి మొత్తం చెదలుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోతు న్నాయి. అటవీ సంపదను కాపాడాల్సిన వారే ఈ విధంగా నిర్లక్ష్యం చేయ డం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆరు బయటనే నిల్వ

ఈ విలువైన కలపను సంరక్షించేందుకు కనీసం ఒక షెడ్డు లేదా కప్పు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో కలప అంతా ఆరుబయట చెట్ల కిందనే ఉంటోంది. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్న కలపను వెంటనే గోదాములకు తరలించి రసాయనాలతో శుభ్రం చేసి భద్రపరచాలి. కానీ, ఇక్కడ అలాంటి చర్యలు ఏవీ కనిపించడం లేదు.

వేలానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు

అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కలప వేలం పాటలకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. సరైన సంరక్షణ లేకపోవడంతో కలప నాణ్యత తగ్గి, దాని విలువ భారీగా పడిపోతోంది. ఏటూరునాగారం, ములుగు, పస్రా డివిజన్ల పరిధిలో గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సుమారు రూ. 15 లక్షల విలువైన కలపను అధికారులు స్వాధీనం చేసుకుని డిపోకు తరలించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ కలపను నిల్వ చేయడానికి సరైన షెడ్లు లేకపోవడంతో ఆ దుంగలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పూర్తిగా చెదలుపట్టి పోతున్నాయి. దీంతో నాణ్యత తగ్గిపోయిన కలపను వేలంపాటలో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు ఇక్కడిని వచ్చేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది.

వలస గిరిజనులతో అన్యాయం

ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు

ములుగు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వలస గిరిజనులతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. ములుగు జిల్లా ఆదివాసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, ప్రధాన కార్యదర్శి అన్నవరం రవికాంత్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు వజ్జ రాజు హాజరై మాట్లాడుతూ లంబాడీల షెడ్యూల్ తెగల హోదా తొలగింపు సుప్రీం కోర్టులో కేసు ఉన్న దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్ ఏర్పాటు చేసి తెగల రిజర్వేషన్లు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 18 తెగలు జీవిస్తున్నాయన్నారు. ఇందులో కొన్ని తెగలు విద్య, ఉద్యోగ, సంక్షేమం పరంగా ఒక శాతం రిజర్వేషన్ లేకుండా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు వజ్జ నారాయణ, వజ్జ నర్సయ్య, వాసం నారాయణ, మంకిడి శ్రీనివాస్, జక్కుల శ్రీకాంత్, రామకృష్ణ, మంకిడి స్వామి, వినోద్, మంకిడి రాజబాబు, సుధాకర్, వెంకట్, సోలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం

గోవిందరావుపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల రహదా రులపై మద్యం ప్రియులు మద్యం సేవించి సీసాలను రోడ్లపై పగులగొడుతూ వికృతచేష్టలు చేస్తున్నారని, అలాంటివి మానుకోవాలని సూచించారు. ప్రతిరోజు పోలీస్ సిబ్బంది గ్రామాల్లోని రహదారుల వెంట పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఈ సమయంలో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మసలు కోవాలని సూచించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

వెంకటాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేపట్టి ప్రతి కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేసి పార్టీని బలోపేతం చేయాలని మండల నాయకుడు రామెళ్ల రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, యువ మోర్చా నమో మారథాన్ ప్రవాస్ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటాలని అన్నారు. సమావేశంలో నాయకులు బొల్లె సునీల్, సాధనపల్లి విజయ్‌కుమార్, నేముల శ్రీకిషన్, తోట సతీష్, కోకిల శ్రీను, మట్టి రమేష్, ఆదినారాయణ, ఆలం కృష్ణారావు, కుంజ నరేం ద్ర, నాగేంద్రబాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దినసరి వేతన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

ఏటూరునాగారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం మండల కేంద్రంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట మూడవ రోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన వెంకటరెడ్డి స సంఘీభావం తెలిపారు. హాస్టల్ వార్డెన్లు, ఉన్నతాధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, వారిని వెంటనే పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, వేతనాలు తగ్గిస్తూ జారీ చేసిన జీవో నంబర్ 64ను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల జయలక్ష్మి, కొప్పుల కమల, సంతోష్, జి. సత్యం, సాంబయ్య, ఎన్. మాణిక్యం, నవత, తాటి రమణయ్యతో పాటు 20 మంది హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

ఏటూరునాగారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించే తెలంగాణ ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిదురాల వాసుదేవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, ఫొటో, వీడియో గ్రాఫర్లు లోటపెటల సర్వేశ్వరరావు, బోడ సారయ్య, బండి రమేష్, చిదురాల సాయి కృష్ణ, మడిగల సురేష్, కర్రీ రవి, గుండ్లపల్లి కార్తీక్, కోడం వివేక్, భూక్య రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కమిటీ ఎన్నిక

ములుగు టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని బొడ్రాయి వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమై వచ్చే నెల 2న దసరా శరనవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలకు కమిటీని ఖరారు చేశారు. అధ్యక్షుడిగా గంద్రకోట కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 24ఏళ్లుగా నుంచి కేంద్రంలో విజయ దశమి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న రావణసుర వధ కార్యక్రమం ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు అన్నారు. సమావేశంలో ధర్మ జాగరణ సమితి సభ్యులు రాసమల్ల శివాజీ, ఓడ రాజు, గాదం దేవేందర్, నరేందర్‌రెడ్డి, గుండబోయిన రమేష్, శ్రీహరి, రాజ్ కుమార్, పవన్, బైకాని రాజశేఖర్, రాయంచు నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాదున్నబీ వేడుకలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మిలాదున్నబీ వేడుకలను ముస్లింలు ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. జామా మసీదు హాఫీజ్ రెహమాన్ మాట్లాడుతూ మహా ప్రవక్త అడుగుజాడల్లో నడుస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మిలాద్ కమిటీ సభ్యులు ఎమ్డీ. అజ్మత్ పాషా, అజ్మత్ ఖాన్, ఖలీల్ ఖాన్, ఫయాజ్ పాషా, అజ్గర్ పాషా, రిజ్వాన్ పాషా, మిన్హాజ్ పాషా, గౌస్, గయాజ్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

హతిరామ్ సేవా సంఘం కమిటీ ఎన్నిక

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని బానోత్‌వీధిలో ఆదివారం హతిరామ్ సేవా సంఘం నూతన కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోతు రాజూ నాయక్, ఉపాధ్యక్షులుగా పోరిక కిరణసింగ్, భూక్య సారమ్మ, ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా తిరుపతి, కోశాధికారిగా బానోతు రాజేందర్, ప్రచార కార్యదర్శులుగా బానోతు రమాకాంత్, బానోతు రమేష్, బానోత్ రవి, గౌరవ అధ్యక్షులుగా బానోతు సమ్మయ్య, బానోత్ సేవా నాయక్, సలహాదారులుగా బానోతు బాలూనాయక్, జుమ్కు నాయక్, సమ్మయ్య ఎన్నికయ్యారు.

నేటి నుంచి జీపీవోల సేవలు

కాటారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ వ్యవస్థలో క్షేత్రస్థాయి అధికారుల సేవలు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న 31 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సేవలను అందించడానికి జీపీవోల (గ్రామ పరిపాలన అధికారులు) వారికి కేటాయించిన క్లస్టర్లలో సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలోని కీలకమైన క్షేత్రస్థాయి వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను రద్దు చేయడం విదితమే. ధరణి స్థానంలో భూభారతి చట్టం తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారం, సమాచార సేకరణ కోసం జీపీవోల వ్యవస్థను తెచ్చి పరీక్ష నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేసింది. మండలంలో 31 రెవెన్యూ గ్రామాలను తొమ్మిది క్లస్టర్లుగా విభజించారు. ఎనిమిది క్లస్టర్లకు జీపీవోలను కేటాయించగా దామెరకుంట క్లస్టర్ ఖాళీగా ఉంది. కాటారం క్లస్టర్‌కు జీపీవోగా గొట్టం నరేష్ బాధ్యతలు స్వీకరించారు. గారెపల్లి క్లస్టర్ (గారెపల్లి, నస్తూరు పల్లి)కు కొత్తూరి నీలయ్య, చిద్నెపల్లి క్లస్టర్(చిద్నెపల్లి, బొప్పారం, ప్రతాపగిరి, మోరపల్లి, పోచంపల్లి)కు మానేటి రాజేందర్, ధన్వాడ క్లస్టర్(ధన్వాడ, దేవరాంపల్లి, రేగులగూడెం)కు నిమ్మల హరిత, ఒడిపిలవంచ క్లస్టర్ (ఒడిపిలవంచ, ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి, వీరాపూర్)కు పూతల శ్యామ్, విలాసాగర్ క్లస్టర్ (విలాసాగర్, ధర్మసాగర్)కు ఆకుల మనోజ్ కుమార్, కొత్తపల్లి క్లస్టర్ (కొత్తపల్లి, బయ్యారం, మేడిపల్లి, సుందర్రాజ్‌పేట, కంబాల్ పాడ్)కు జాడి రమాకాంత్, చింతకాని క్లస్టర్ (చింతకాని, పోతులవాయి, నల్లగుంట)కు కుమ్మరి దేవరాజు సేవలు అదించనున్నారు. దామెరకుంట క్లస్టర్ (దామెరకుంట, గూడూరు, జాద రావుపేట, రఘుపల్లి, మల్లారం, గుండ్రాత్‌పల్లి రెవెన్యూ గ్రామాలు)కు కేటాయింపు జరగలేదని అధికారులు తెలిపారు.

ఎస్సీ గురుకులం పేరెంట్స్ కమిటీ ఎన్నిక

కాటారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దామెరకుంట సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంలో ఆదివారం తల్లిదండ్రుల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పలు గ్రామాలకు చెందిన గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశమై గురుకులం అభివృద్ధి, విద్యార్థినుల బాగోగులపై చర్చించడానికి ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా అల్లాడి లక్ష్మి, గౌరవ అధ్యక్షులుగా వేల్పుల నాగరాణి సలహాదారుగా ఆకుదారి రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా అడ్డూరి సౌందర్య, ఉపాధ్యక్షులుగా పురుషోత్తం శోభాస్వామి, కోశాధికారిగా గుంటి మల్లేశ్వరి, కార్యదర్శులుగా తోగరి త్రివేణి, శైలజ, కార్యవర్గ సభ్యులుగా కల్పన, ఉమ, మహేశ్వరి, కల్పన, జయప్రద, అరుణ, భవాని, రజిత, స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముదిరాజ్ పరపతి సంఘం ఎన్నిక




మల్లయ్య, అధ్యక్షుడు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ పరపతి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాళిపాక మల్లయ్య, ఉపాధ్యక్షులుగా వేముల రాజమౌళి, నరెడ్ల ఐల య్య, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి రాజయ్య, కోశాధికారిగా కారుపాకల చందు, సహాయ కార్యదర్శిగా తీగల సంతోష్ ఎన్నికైనట్లు కాలనీ పెద్ద మనుషులు కేసరి యాదగిరి, కంచం నర్సింహామూర్తి తెలిపారు. సభ్యులుగా దాసరి వెంకటేశ్వర్లు, సింగం రాము, నరసింహ, కేసరి శ్రీను, మల్లేష్, నాగభూషన్, సాంబయ్య, కుమారస్వామి, రాజు ఎన్నికైనట్లు ప్రకటించారు.

వ్యవసాయ క్లస్టర్లకు యూరియా

కాటారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండ లంలోని రేగుల గూడెం, దామెరకుంట వ్యవసాయ క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికల్లో యూరియా బస్తాల పంపిణీ కోసం ఆదివారం లారీ రాగా వాటిలో నిల్వచేసే అవకాశం లేక మండలకేంద్రంలోని పీఏసీఎస్ గోడౌన్‌కు తరలించారు. రేగులగూడెం రైతు వేదిక వద్దకు లారీ వెళ్లే అవకాశం లేకపోవడం, దామెరకుంట రైతువేదికలో బస్తాలకు రక్షణ ఉండదని తలచిన వ్యవసాయాధికారులు మొదటగా వచ్చిన బస్తాలను నిల్వ చేసి అనంతరం పంపిణీ గురించి చర్యలు తీసుకోవచ్చని గోడౌన్‌లో అన్‌లోడ్ చేయించారు. 579 బస్తాల లోడ్‌తో లారీ వచ్చినట్లు గోడౌన్ నిర్వాహకులు తెలిపారు. ఈ యూరియా బస్తాలను ఏ పరిధిలోని రైతులకు అందిస్తారో తెలియాల్సి ఉంది.

లోతట్టు ప్రాంతాలు జలమయం



చేపలు పడుతున్న గ్రామస్థులు

కాటారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమ య్యాయి. పలు చోట్ల పొలాల్లోకి, ఇళ్ల మధ్య వరద నీరు చేరింది. భారీ వర్షంతో గూడెం చెరువు మత్తడి దుముకు తుండటంతో ప్రజలు చేపల వేటకు దిగారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



దంపు చేసిన ఇసుకను లారీలో లోడ్ చేస్తున్న జేసీబీ

టేకుమట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంవత్సర కాలంగా మానేరు నది నుంచి ఇసుక అక్రమ రవాణా విచ్చల విడిగా కొనసాగుతోంది. రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు కార్యాలయాల ముందు నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు నిరంతం ఇసుకను తరలిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి.

కార్యాలయాలకు కూతవేటు దూరంలో డంపు

మండల కేంద్రంలోని పోలీసు, రెవెన్యూ కార్యాలయాలకు కూతవేటు దూరంలో పెద్దమొత్తంలో ఇసుకను డంపు చేసి రాత్రి సమయంలో లారీలలో లోడ్‌చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలుస్తోంది. ఈ తతాంగమంతా అధికారులకు తెలిసే జరుగుతోందని, అందుకే డంపుల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నిబంధనలకు తూట్లు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం ఇటీవల కొన్ని నిబంధనలతో మండలానికో రీచ్‌ను ఏర్పాటు చేసింది. టేకుమట్ల గ్రామ శివారులోని చలివాగులో రీచ్ ఏర్పాటు చేసి అందులోంచి మాత్రమే ఇసుక తీసుకోవాలని అధికారులు ట్రాక్టరు యాజమానులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, ప్రభుత్వ నిర్మాణాలకు జిల్లా పరిధిలో మాత్రమే అధికారుల అనుమతితో ఇసుక రవాణా చేయాలని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా చలివాగు, మానేరు ఆనుకొని ఉన్న గ్రామాల నుంచి ఇసుక తవ్వకాలు చేస్తూ ఇతర జిల్లాలకు తరలిస్తున్నట్టు సమాచారం. నిబంధనలు పెట్టిన అధికారులు పర్యవేక్షించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం కొంతమంది అనుమతులు లేకుండా ఇసుక కోసం మానేరులో దిగి ప్రమాదానికి గురయ్యారు. మానేరు వద్ద విధులు నిర్వర్తించాల్సి అధికారులు విస్మరించడంలో అక్రమార్కులు మానేరులో దిగి ఇసుక తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మానేరు ఉప్పొంగటంతో 10 ట్రాక్టర్లు, నలుగురు డ్రైవర్లు వరద నీటిలో చిక్కుకుపోయారు. వారు ప్రాణాలతో ఒడ్డుకు చేరగా, ట్రాక్టర్లు మాత్రం వాగులోనే మనిగిపోయాయి.

వీడని నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

గురిచేస్తున్నట్లు విమర్శలున్నాయి.

లోపించిన పారిశుధ్యం

ఆస్పత్రిలో పారిశుధ్య సమస్య వేధిస్తోంది. శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ వర్షపునీరు చేరడంతో దోమలు వ్యాప్తి చెంది మరిన్ని రోగాలపాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆస్పత్రి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. అలాగే ఆస్పత్రిలో ఎక్కడపడితే అక్కడ బయో వేస్టేజ్ పేరుకుపోతుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని పెద్ద సారు

జీజీహెచ్‌ను గాడిలో పెట్టాల్సిన ఉన్నతాధికారి పరిపాలన పరంగా పట్టు సాధించపోవడంపై నిర్లక్ష్యం పెరిగిందనే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది సక్రమంగా విధులు హాజరు కాకపోవడం, టైమ్ పాటించకపోవడంపై చర్యలు తీసుకోవాల్సిన ఆయనే సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. అప్ అండ్ డౌన్ చేస్తూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మధ్యాహ్నం వరకే ఆయన విధుల్లో ఉండి ఎంచక్కా బస్సెక్కి హనుమకొండకు పయనమవుతున్నారని సమాచారం. ముఖ్యంగా శానిటేషన్, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో ఆయన విఫలమయ్యారనే ఆరోపణలు రావడంతో ఎమ్మెల్యే, కలెక్టర్ కలుగజేసుకోవడంతో సద్దుమణిగింది. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆస్పత్రిలో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక విషయంలో ఆ ఉన్నతాధికారి వ్యవహరించిన తీరు తీవ్ర వివాదస్పదమైంది. ఆయన ఆస్పత్రి పరిపాలనలో ఉదాసీనంగా వ్యహరించడంతో భూపాలపల్లి పట్టణంలోని రాజకీయ కుటుంబానికి చెందిన ఓ వైద్యురాలు అన్నితానై వ్యవహరిస్తున్నట్టు ఆరోణలు వస్తున్నాయి. ఆస్పత్రి వ్యవహారాలపై చర్చించేందుకు తనను కలవాలని ఆ ఉన్నతాధికారికి కలెక్టర్ రాహుల్ శర్మ సమాచారం పంపినా పెడచెవిన పెట్టారని తెలిసింది.

'ఫీ'ఫైర్!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వీటిలో ఇంజనీరింగ్ కళాశాలల రీయింబర్స్‌మెంట్ ఫీజు రూ.35వేలు. మిగతావాటివి రూ.25వేల లోపే. ఒకప్పుడు 27 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండేవి. నిర్వహణ భారం వల్ల వీటిలో చాలా వరకు మూతపడ్డాయి.

టోకెన్లు ఇచ్చినా..

ఫీజు రీయింబర్స్ బకాయిల బిల్లుల దరఖాస్తులను ఆయా ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల్లో ఎప్పటికప్పుడు సమర్పిస్తున్నాయి. వీటికి ఆ కార్యాలయాలు టోకెన్లయితే ఇస్తున్నారు కానీ.. చెల్లింపులు జరగడం లేదని కళాశాలల నిర్వాహకులు వాపోతున్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తులను గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లోనే సమర్పించారు. వీటికి టోకెన్లు ఇవ్వగానే ఇక చెల్లింపులు జరుగుతాయని కళాశాలల యజమానులు ఆశపడ్డారు. కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడంతో వారు నిరాశకు లోనవుతున్నారు. నిధుల ఫ్రీజింగ్ వల్ల ప్రతీనెల ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ నిధులను మాత్రమే పరిష్కరిస్తున్నామని, మిగతా ఎలాంటి బిల్లులకు ఆమోదం లభించడం లేదని సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. మూడేళ్లుగా ఫీజులు విడుదల కాకపోవడంతో కళాశాలలను నడపడం కష్టంగా ఉందని యజమాన్యాలు వాపోతున్నాయి.

సర్టిఫికెట్లు ఇవ్వక..

ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో యజమాన్యాలు చదువు పూర్తిచేసిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. పైచదువుల కోసం వేరే కాలేజీలో ప్రవేశం తీసుకోవాలనుకుంటున్న విద్యార్థులు సైతం సర్టిఫికెట్లు లేక నష్టపోతున్నారు. దీనితో మరోదారి లేక పేద, మధ్య తరగతి విద్యార్థులు అప్పులు చేసి ఫీజు బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లను తీసుకోవలసి వస్తోంది.

పలుకుబడి ఉంటేనే..

అధికార పార్టీ అండదండలు, పలుకుబడి ఉన్న ప్రైవేటు కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాత్రం వెంట వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పేరున్న విద్యాసంస్థల యాజమాన్యాలు తమ పలుకుబడిని ఉపయోగించి, ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెచ్చి ఎలాగోలా బకాయిలను క్లియర్ చే యించుకుంటున్నాయి. కానీ పలుకుబడి, రాజకీయ నేపథ్యం లేని చిన్న కాలేజీలు మాత్రం బ కాయిల కోసం ఏళ్ల తరబడి వేచిచూడాల్సి వ స్తోంది. చెల్లింపుల కోసం అధికారుల చు ట్టూ ఎంత తిరిగినా ఫలితం ఉండడం లేదు. ఫీజులు రాకపోవడంతో వాటి మనుగడ కష్టమవుతోంది.

పరీక్షల కేంద్రాల మార్పు

సెప్టెంబరు 15 నుంచి ప్రైవేట్ కళాశాలలు బంద్ కానున్న నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షల కేంద్రాలను మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. 15న మ ధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హంటర్‌రోడ్డులోని అల్లూరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో జరగాల్సిన ఎల్ఎల్‌బీ 5 ఏళ్ల 6వ సెమిస్టర్ పరీక్షను సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సెప్టెంబరు 15, 17, 19వ తేదీల్లో జరగాల్సిన ఫార్మాడీ మొదటి ఏడాది పరీక్షల కేంద్రాలను ప్రైవేట్ కళాశాలల నుంచి మార్చినట్లు ప్రకటించారు. విద్యార్థులు తమ పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేతల మస్జిద్ విజిట్



ఇస్లాం గురించి వివరిస్తున్న మసీదు కమిటీ బాధ్యుడు

మహదేవపూర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మస్జిద్ (మసీదు)ను కాంగ్రెస్ నేతలు సంద ర్శించారు. మస్జిద్ విజిట్ కార్యక్రమాన్ని కార్యనిర్వాహక కమిటీ ఆదివారం నిర్వహించగా కాంగ్రెస్ నేతలు పాల్గొ న్నారు. వారికి మసీదులో నిత్యం జరిగే ప్రార్థనల గురించి కమిటీ సభ్యులు వివరించారు. ఇస్లాంలో మానవ సంబం ధాలకు ఉన్న ప్రాధాన్యం, పరమత సహనం తదితర అం శాలపై అవగాహన కల్పించారు. ఖురాన్ విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

(5వ పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని అన్నారు. దేశంలో పెద్ద జాతరగా జరుపుకునేలా ఏర్పాట్లు జరుగుతాయని తెలిపారు. కొందరు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ దయాకర్, ముందుగా తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పస్రా ఎస్సై కమలాకర్, కాంగ్రెస్ నాయకులు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మేడారం మాజీ చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, సునీల్, మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర్‌రావు, నార్లాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోలు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎనగంటి నరేష్, నాయకులు మడకం శోభన్, నూనావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.